ఎమ్మెల్సీని కలిసిన బీఆర్ఎస్ కార్యవర్గ సభ్యులు

జగిత్యాల అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎంపికైన బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల భారత రాష్ట్ర సమితి కార్యవర్గాల సభ్యులు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్.రమణను మంగళవారం ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులందరినీ శాలువాతో సత్కరించిన ఆయన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బీర్‌పూర్ మండల శాఖ అధ్యక్షుడు అయిల్నేని ఆనందరావు, నేరెళ్ల సుమన్, బీఆర్ఎస్ సారంగాపూర్ మండల శాఖ అధ్యక్షుడు తేలు రాజు, కార్యదర్శి గంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ రమణ, సాగి సత్యం రావు, గట్టు సతీష్, పడిగెల గంగారెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మహిళలు ఆర్థిక రంగాల్లో రాణించాలి

జగిత్యాల అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళలు సహకార స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని జగిత్యాల మహిళా సమైఖ్య ప్రతినిధి పద్మ అన్నారు. 71వ సహకార వారోత్సవాలను పురస్కరించుకుని మెప్మా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలందరు సహకార స్ఫూర్తితో సంఘాలుగా ఏర్పడి విద్య, ఉద్యోగం, ఉపాధి, ఆర్థిక రంగాల్లో రాణించాలని ఆమె కోరారు. అంతకుముందు ఆమె సహకార పతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సభ్యులతో సహకార గీతాన్ని ఆలపించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైఖ్య మాజీ అధ్యక్షురాలు విజయ, మెట్‌పల్లి పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బబ్బూరి లక్ష్మి, మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్, భూకైలాస్, టీఎంసీ రజిత, డీఎంసీ సునీత పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ

బీర్‌పూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లధర్మారం మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మృతిడి కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామానికి చెందిన అన్నారపు రాములు ఇటీవల అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మృతుడు రాములు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మన్‌రావ్, కొల్వాయి సింగిలివిండో చైర్మన్ నవీన్‌రావ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుభాష్, మాజీ ఎంపీటీసీ మల్లీశ్వరి తిరుపతి, జోగిరెడ్డి ఉన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

రాయికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 21న గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రాయికల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్ తెలిపారు. శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేసి మోతె బిందు ఆపరేషన్ అవసరమైన వారికి రేకుర్తి కరీంనగర్ కంటి వైద్యశాలలో ఆపరేషన్ చేయనున్నారు.

మహిళా సంఘాలకు ఊరట



- వడ్డీ బకాయిలు విడుదల
- 3,402 ఎస్‌హెచ్‌జీలకు లబ్ధి
- జిల్లాకు రూ. 1.38 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- డిసెంబరు ముందు బకాయిలపై స్పష్టత కరువు



జగిత్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల నుంచి పొందిన రుణాలు వాయిదాల ప్రకారం సక్రమంగా చెల్లించిన స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల రాయితీని ప్రభుత్వం మంజూరు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరి, మార్చి రెండు నెలల వీఎల్ఆర్ నిధులు విడుదల చేస్తూ సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై ప్రభుత్వం నుంచి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కార్యాలయానికి లేఖ, ఈ మెయిల్ అందింది. నేరుగా అర్హులైన సంఘాల ఖాతాల్లో ఈ నిధులు జమ చేస్తున్నట్లు..దీనిపై సంబంధిత గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మహిళా సంఘాలకు తెలియజేయాలని అందులో పేర్కొన్నారు. వీటికోసం ఎదురు చూస్తున్న మహిళా సంఘాల సభ్యులు సర్కారు కానుకగా భావించి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధులను వడ్డీ లేని రుణాలకు అర్హత పొందిన సంఘాల సభ్యుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

జిల్లాలో వడ్డీ రాయితీ విడుదల ఇలా..

జిల్లా వ్యాప్తంగా 3,402 స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ. 1.38 కోట్ల వడ్డీ రాయితీని ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో బీర్‌పూర్ మండలంలో 67 సంఘాలకు రూ. 3 లక్షలు, బుగ్గారంలో 49 సంఘాలకు రూ. 2 లక్షలు, ధర్మపురిలో 169 సంఘాలకు రూ. 6 లక్షలు, గొల్లపల్లిలో 162 సంఘాలకు రూ. 6 లక్షలు, ఇబ్రహీంపట్నంలో 111 సంఘాలకు రూ. 4 లక్షలు, జగిత్యాల రూరల్‌లో 228 సంఘాలకు రూ. 4 లక్షలు, జగిత్యాలలో 25 సంఘాలకు రూ. లక్ష విడుదల చేసింది. అదేవిధంగా కథలాపూర్‌లో 110 సంఘాలకు రూ. 5 లక్షలు, కొడిమ్యాలలో సంఘాలకు రూ. 13 లక్షలు, కోరుట్లలో 282 సంఘాలకు రూ. 11 లక్షలు, మల్లాపూర్‌లో 468 సంఘాలకు రూ. 14 లక్షలు, మల్యాలలో 232 సంఘాలకు రూ. 11 లక్షలు, మేడిపల్లిలో 139 సంఘాలకు రూ. 6 లక్షలు, మెట్‌పల్లిలో 236 సంఘాలకు రూ.10 లక్షలు, పెగడపల్లిలో 266 సంఘాలకు రూ.12 లక్షలు, రాయికల్‌లో 144 సంఘాలకు రూ.6 లక్షలు, సారంగపూర్‌లో 131 సంఘాలకు రూ.5 లక్షలు, వెల్గటూరులో 315 సంఘాలకు రూ. 14 లక్షలు వడ్డీ రాయితీని ప్రభుత్వం విడుదల చేసింది.

జిల్లాలో 14,694 సంఘాలు..

జిల్లాలోని ఆయా గ్రామాల్లో 14,694 స్వయం సహాయక మహిళా సంఘాలున్నాయి. ఆయా సంఘాలలో 11,73,412 మంది సభ్యులుగా ఉన్నారు. సంఘాల్లోని సభ్యులకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి, ఆదాయం వచ్చే ఆస్తులను కొనుగోలు చేసి, ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధితో పాటు వివిధ రకాల రుణాలను అందిస్తారు. సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుంది. ఆ విధంగా చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం తిరిగి వడ్డీని నేరుగా సభ్యుల ఖాతాల్లో జమ చేస్తుంది. గత ప్రభుత్వ హయాంలో మూడేళ్లుగా వడ్డీ విడుదల చేయలేదు. దీంతో మహిళా సంఘాల సభ్యులు వడ్డీ కోసం ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ బకాయిలను వెంట వెంటనే విడుదల చేస్తోంది.

(తరువాయి 8వ పేజీలో)

జగిత్యాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పొన్నాల గార్డెన్స్‌లో పట్టణానికి చెందిన 170 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 47 లక్షల విలువ గల చెక్కులు, 12 మంది ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ రూ. 12 లక్షలు విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలోనే జగిత్యాల పట్టణంలో రూ. 40 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. నూకపల్లి వద్ద నిర్మించిన 4,520 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లతో సుమారు 20 వేల మంది నిరుపేద ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. రూ. 34 కోట్లతో డబుల్ బెడ్ రూమ్ కాలనీలో మౌళిక సదుపాయాల కల్పన పనులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా పల్లె, బస్తీ దవాఖానాలు జగిత్యాలకు మంజూరు అయ్యాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో సుమారు రూ. 3 కోట్ల సీఎం సహాయ నిధి చెక్కులు జగిత్యాల నియోజకవర్గానికి అందాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం దృష్టిలో ఉంచుకొని సీఎం రేవంత్ రెడ్డితో కలిసి పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల తర్వాతే కళాశాలల నిర్వహణ

- అప్పటివరకు బంద్‌కు నిర్ణయం
- ఎస్‌యూ వీసీకి నోటీస్ ఇచ్చిన డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు



శాతవాహన యూనివర్సిటీకి నోటీస్ ఇస్తున్న కళాశాలల యాజమాన్యాలు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గడిచిన రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసిన తర్వాతే కళాశాలల నిర్వహణ కొనసాగిస్తామని శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ తరుపున కరస్పాండెంట్‌లు ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేశారు. కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌లను కలిసి తమ ఎజెండాను వివరిస్తూ, వినతిపత్రం సమర్పించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంతో పాటుగా ప్రస్తుత ప్రజాప్రభుత్వంలో కూడా విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రభుత్వ పెద్దలు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తప్పిని పరిస్థితుల్లో ఈ నెల 19 నుంచి కళాశాలలు నిరవధిక బంద్ చేస్తున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కళాశాలల నిర్వహణ తమకు సాధ్యం కాదని, దీంతో సెమిస్టర్ పరీక్షలు సైతం నిర్వహించలేమన్నారు. తమ సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరేందుకే వీసీని కలిసి వినతిపత్రం సమర్పించామన్నారు. ఈ ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆయా కళాశాలల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

రివ్యూ సమావేశంలో కలెక్టర్ సత్యప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో జరుగుతున్న ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజనపై ఆయన రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పీఎంజీఎస్‌పై ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, సబ్‌సెంటర్లు, గ్రామ పంచాయతీ భవనాలపై పంచాయతీ రాజ్ ఇంజనీర్లతో ఐడీఓసీ జగిత్యాల కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించిన కలెక్టర్ ప్రస్తుతం జరుగుతున్న పనులన్నిటినీ వీలైనంత తద్వరగా పూర్తి చేయాలని ఆదేశించినారు. అదే విధంగా ఫిబ్రవరి 28 నాటికి పంచాయతీ, పీఎంజిఎస్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి ఏపీఆర్ రహమాన్ సంబంధిత అధికారులు డీఈలు, ఏఈలు పాల్గొనారు.

అధ్వానంగా ఎస్సారెస్పీ కాలువలు

- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో రైతులు

6



పెగడపల్లి శివారులో ఎస్సారెస్పీ డీ77 కాలువలో పిచ్చి మొక్కలు

రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం

- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

6



మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

జిల్లా ప్రముఖులను కలిసిన వెలమ సంక్షేమ సంఘం సభ్యులు

జగిత్యాల అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) ఇటీవల ఎంపికైన జగిత్యాల జిల్లా పద్మనాయక వెలమ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్ కుమార్‌ను ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలను జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో కలిశారు. నూతన కార్యవర్గాన్ని విప్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అభినందించారు. అలాగే జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పద్మనాయక వెలమ సంఘం కార్యవర్గ సభ్యులు కలిశారు. ఈ సంధర్బంగా వారిని ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ అధ్యక్షులు అయిల్నేని సాగర్‌రావు, ప్రదాన కార్యదర్శి దన్నపునేని వేణుగోపాల్ రావు, ఉపాధ్యక్షులు బండారి దివాకర్ రావు, సూరి గేని కమలాకర్‌రావు, కోశాధికారి ఎన్నమనేని రాజలక్ష్మీనరసింహారావు, అర్గనైజింగ్ సెక్రెటరీలు ఇమ్మనేని ప్రశాంతరావు, అయిల్నేని రవీందర్‌రావు, కమిటీ సభ్యులు అజయ్‌రావు, అనిల్ కుమార్, మెన్నేని ప్రవీణ్ రావు, రాంప్రసాద్ రావు, పునుగోటి సురెందర్‌రావు, మెన్నేని సురెందర్ రావు, వలమ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇందిర సేవలు చిరస్మరణీయం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ఇందిర విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎ మ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఇందిరా గాంధీ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలవేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని పాత బస్టాండు వద్ద గల ఇందిరా విగ్రహానికి పూలమాల వేశారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన పలువురు యువకులు, కార్యకర్తలకు ప్రశంసా పత్రాలను అందించారు. భారత దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర వనిత ఇం దిరా గాంధీ అని కొనియాడారు. దేశం కోసం చేసిన సేవలు మరవలేనివన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిర సంస్కరణలు అందరికీ ఆదర్శం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

దేశ మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ చేసిన సంస్కరణలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పొన్నా ల గార్డెన్స్‌లో ఇందిరా గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేశారు. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుచరులు ఉన్నారు.



ఇందిర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

సీఎం పర్యటనతో అభివృద్ధి మరింత ముందుకు

- ధర్మపురి ఎమ్మెల్యే, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



కథలాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అడ్లూరి

కథలాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 20న వేములవాడలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతానికి నిధులు ప్రకటించడానికి అవకాశం ఉన్నందున అభివృద్ధి మరింత ముందుకు వెళుతుందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా వేలాది ఎకరాలకు నీరందించే సూరమ్మ చెరువు పను లు పూర్తి కాలేదని ఆనాడు ప్రతిపక్ష హోదాలో ఆది శ్రీనివాస్ 38 దఫాలుగా నిరసనలు చేపట్టినా స్పందించలేదన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ రాజ్యంలో మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారని అన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే కార్యక్రమం కొద్ది రోజుల్లో ప్రారంభం కానుందని చెప్పారు. రైతు రుణ మాఫీ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ సర్కారు నిలబెట్టుకుందని సాంకేతిక కారణాలతో నిలిచిపో యిన రైతులకు ప్రభుత్వం రుణ మాఫీ చేయబో తోందని తెలిపారు. రాష్ట్రంలో వడ్ల కొనుగోళ్ల ప్రక్రి య ఎలాంటి అవాంతరాలు లేకుండా సాఫీగా కొనసాగుతోందని ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టడం దా రుణమని ఆరోపించారు.

ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, ఎన్ఎస్ యుఐ నియోజకవర్గ కన్వీనర్ అకుల సంతోష్, పూంద్ర నారాయణరెడ్డి ఉన్నారు.

ఏసీబీ వలలో అంతర్గాం తహసీల్దార్

డబ్బులు పడేసి పారిపోయిన ఆర్‌ఐ


తహసీల్దార్ ఉయ్యాల రమేష్, బాధితుడు ఆలకుంట మహేష్

అంతర్గాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అంతర్గాం తహసీల్దార్ ఉయ్యాల రమేష్‌తో పాటు ఆర్‌ఐ ఎగ్గిడి శ్రీధర్‌లు ట్రాక్టర్ ఓనర్ వద్ద రూ.12వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏసీబీ అధికారులు, బాధితుడు ట్రాక్టర్ ఓనర్ ఆలకుంట మహేష్ తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 28న మండల పరిధిలోని లింగాపూర్ గోదావరినది సమీపంలో ట్రాక్టర్‌ను అంతర్గాం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ ఓనర్ ఆలకుంట మహేష్‌ను పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. జరిమానా రూ.50 వేలు చెల్లించాలంటూ తహసీల్దార్ రమేష్ చెప్పారు. తాను పేదవాడినని అన్ని డబ్బులు చెల్లించలేనని బాధితుడు మహేష్ వేడుకోగా సంబంధిత ఆర్‌ఐ శ్రీధర్‌ను కలవమని తహసీల్దార్ సూచించారు. దీంతో బాధితుడు ఆర్‌ఐని కలువగా రూ.12 వేలు డీడీ తీసి ఇవ్వడంతో పాటు మరో రూ.12వేలు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు బాధితుడు రూ12వేల డీడీతోపాటు రూ.12వేల నగదును ఆర్‌ఐ శ్రీధర్‌కు ఇవ్వగా, ఆయన డబ్బులతో తహసీల్దార్ చాంబర్‌కు వెళ్లాడు. వెంటనే ఆఫీస్‌లోకి వచ్చిన ఏసీబీ అధికారులు తహసీల్దార్ రమేష్, ఆర్‌ఐ శ్రీధర్‌లను పట్టుకునేందుకు ప్రయత్నించగా డబ్బులు ఆఫీస్ బయట పడవేసిన ఆర్‌ఐ శ్రీధర్ తప్పించుకొని పరారయ్యాడు. దీంతో ఏసీబీ అధికారులు తహసీల్దార్ రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అంతకు ముందు బాధితుడితో మాట్లాడిన తహసీల్దార్ రమేష్, ఆర్‌ఐ శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. దాడులలో ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి, ఇన్‌స్పెక్టర్లు కృష్ణ కుమార్, తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.


బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల కోలాహలం

బద్దిపోచమ్మకు బోనాల మొక్కులు

డప్పుచప్పుళ్లు, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపు

వేములవాడ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారికి భక్తులు బోనాల మొక్కులు చెల్లిం చుకున్నారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జామున అమ్మవారికి నైవేద్యాన్ని ఏర్పాటు చేసుకుని డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. నెత్తిన బోనాలతో గంటల తరబడి అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. బద్దిపోచమ్మకు పట్నాలు వేసి ఒడిబియ్యం సమర్పించారు. అనంతరం అమ్మవారికి కల్లు సాక పెట్టి పిల్లాపాపలు, పాడిపంటలు చల్లంగా ఉండాలని వేడుకున్నారు.


బోనాలతో బారులు తీరిన భక్తులు

ఉద్యోగులపై దాడిని ఖండిస్తున్నాం

ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి

సుభాష్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొంతమంది నాయకులు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యోగులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో అయన మాట్లాడుతూ అమాయక ప్రజలను రెచ్చగొడుతూ తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి అమలు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను బెదిరింపులకు గురి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆ ప్రభుత్వం ఆదేశాలను ఉద్యోగులు పాటిస్తారన్నారు. తమ స్వంత ఆలోచనలు గాని, స్వంత ఎజెండా గాని ప్రభుత్వ ఉద్యోగులకు ఉండదని ఈ విషయాన్ని రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మన్‌రావు, నాగులు నరసింహస్వామి, హరికృష్ణ, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, ముప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి, ఒంటెల రవీందర్‌రెడ్డి, గంగారపు రమేశ్, మహిళ ఉద్యోగుల ప్రతినిధులు శారద, సునీత, విజయలక్ష్మి, శైలజ, సర్దార్ హర్మిందర్‌సింగ్, జలాలుద్దీన్‌అక్బర్, గుంటి బిక్షపతి, అభిషేక్‌రెడ్డి, శంకర్, మన్మిత్‌సింగ్, హస్గర్ శ్రీనివాస్, కమలాకర్, నాల్గవ తర గతి ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు కోట రామస్వామి, శంకరయ్య, రాజేశ్వర్‌రావు, ఎల్లె శీను, వంశీ, బోనాల రవి, అజయ్, నారాయణ, వివిద ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలు

శంకరపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లా అండర్-14, అండర్-17 బాలబాలికల బీచ్‌వాలీబాల్ ఎంపిక పోటీలను ఎంఈవో లక్ష్మీనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈపోటీల్లో వివిధ పాఠశాల నుంచి వచ్చిన వందమంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుభాష్, పెట రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీను, మోడల్ స్కూల్ ప్రెసిడెంట్ అనూప్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతదేహం వెలికితీత

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని దమ్మక్కపేటకు చెందిన కొండబత్తిని రాజేశ్వరి(65) సోమవారం బావిలో దూకగా, రెండు రోజుల పాటు గాలించిన పోలీసులు గ్రామస్థుల సహాయంతో మంగళవారం మృతదేహన్ని బయటికి తీశారు. రాజేశ్వరి భర్త రాజాకిషన్ 14సంవత్సరాల నుంచి పక్షవాతంతో బాద పడుతున్నారు. భర్త పరిస్థితిని చూసి మనోవేదనకు గురైన రాజేశ్వరి బావిలో దూకి ఆత్మహత్యకు చేసుకుంది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజేశ్వరి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బీర్‌పూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్వాయి గ్రామంలో సోమవారం గ్రామానికి చెందిన సల్ల గంగన్న ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయింది. బాధి తులు గంగన్న కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ప్రమాదంలో 65వేల నగ దు, ముప్పావు తులంబంగారం, 25 తులాల వెండి పూర్తిగా కాలిపోయిందని విలపించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ పరిశీలకులు శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని ప్ర మాద నష్టాన్ని అంచనా వేసి పై అధికారులకు నివేదించారు.

ఒకరిపై కేసు నమోదు

చొప్పదండి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 15న గాలిపెల్లి కనకయ్యకు చెందిన వస్త్ర దుకాణాన్ని పెట్రోల్‌పోసి నిప్పంటించిన కోడూరి శ్రీనివాస్ అనే వ్యక్తిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ అనూష మంగళవారం తెలిపారు. వస్త్ర దుకాణంలో మంటలు వ్యాపించగా ఆరులక్షల రూపాయల ఆస్తినష్టం వాటిల్లినట్లు వ్యాపారి కనకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విత్తన చట్టంలో మార్పులు, చేర్పులు చేస్తాం

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

జగిత్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో రైతులను విత్తన కంపెనీల నుంచి మోసాలకు గురికాకుండా విత్తన చట్టంలో మార్పులు, చేర్పులు చేసే విధం గా ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్య క్షుడు అన్వేష్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సమీ కృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న విత్తన చట్టంలో ఉన్న లోసుగుల వల్ల ప్రైవేటు కంపెనీలకు అనుకూలంగా ఉన్న పరిస్థితులున్నాయన్నారు. ప్రైవేటు కంపెనీల మోసాలకు గురికాకుండా ప్రభుత్వ విత్తన సంస్థ అందించే మేలు అయిన రకాల విత్తనాలను వినియోగించాలని రైతులను కోరారు. వివిధ రకాల ప్రైవేటు కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయన్నారు. రకరకాల ఆకర్షనీయమైన ప్రకటనలతో ఆకర్శించి సొంత వెరైటీ విత్తనాలను రైతులకు విక్రయించి ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ప్రైవేటు విత్తనాల వల్ల రైతులు పంట నష్టపోతే పరిహారం అందించడం లేదన్నారు. కేవలం విత్తన పెట్టుబడులను మాత్రమే అందిస్తున్నారన్నారు. పంట ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసే యోచన చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కొందరు రకరకాల ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘ నాయకులు పిడుగు తిరుపతిరెడ్డి, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం

రాష్ట్రంలో రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. మంగళ వారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ శాఖ, ప్రాథమిక వ్యవసాయ సంఘాల కార్య దర్శులు, వ్యవసాయ అధికారులతో యా సంగి 2024-25 పంట సీజన్ సందర్భంగా ప్రత్యే క సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రానున్న రోజుల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యక్రమా లను మరింత ముమ్మరం చేస్తామన్నారు. నా ణ్యమైన విత్తనాలు అందించే విత్తనాభివృద్ధి సం స్థను సహకార సంఘాలు ప్రోత్సహించాలన్నా రు. జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీసీఎం ఎస్ చైర్మన్ ఎలాల శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి సీహెచ్ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్‌పర్సన్ అసోసియేషన్ బాధ్యులు, పాల్గొన్న పెన్షనర్లు

సుభాష్‌నగర్, నవబంరు 19(ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్ డిమాండ్ చేశారు. మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నూతన పీఆర్‌సీని 2023 జూలై నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.15వేలు ఇవ్వాలని, ప్రతి జిల్లా కేంద్రంలో రెండు వెలనెస్ సెంటర్లను ఏర్పాటు చేసి, పెన్షనర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కార్పోరేట్ స్థాయిలో వైద్యం అందించాలని కోరారు. గ్యాడ్యుటీని కేంద్ర ప్రభుత్వం మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రూ. 20లక్షలు చెల్లించాలని కోరారు. పెన్షనర్లు కూడా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని, వారికి ప్రత్యేక ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కట్ట నాగ భూషణాచారి, కోశాధికారి ఇరువంటి తిరుమలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బొంగోని వెంకటయ్య, గరిగ చంద్రయ్య, నల్ల ప్రభాకర్‌రెడ్డి, రాయికంటి రామకృష్ణయ్య, ఆర్‌టీసీమల్లయ్య చొల్లేటి మాల్లరెడ్డి, అరికాల చంద్రమౌళి, తాటిపాముల కనకయ్య, ఎస్ సారభద్రస్వామి, బి జగదీశ్వర్, కొండా రాజయ్య, ఎం గోపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, ఊకంటి లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న పలువురి అరెస్టు

వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని మెట్‌పల్లిసిఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం బండలింగాపూర్ క్రాస్ రోడ్డు వద్ద గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సిఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ బండలింగాపూర్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వెళ్తుండగా ఆపి తనిఖీ చేయగా బైక్‌లో నల్లని కవరులో తీసు కెళ్తున్న గంజాయిని పట్టుకున్నాట్లు తెలిపారు.

వారి వద్ద నుండి 220 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నాట్లు తెలిపారు. గంజాయి తర లిస్తున్న మెట్‌పల్లికి చెందిన లోకిని వంశీ, కోయిల్కర్ రమేష్, లోకిని విగ్నేష్‌లను విచారించగా నిజామాబాద్ రైలులో నాండెడుకు వెళ్లి గతంలో పరిచయం ఉన్న అజార్ అనే వ్యక్తి వద్ద నుండి గంజాయి కోనుగోలు చేసి అక్కడి నుండి మెట్‌పల్లికి కోను గోలు చేసిన గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి 500 చొప్పున అమ్మెందుకు వస్తుండగా పట్టుకున్నాట్లు తెలిపారు. ముగ్గురు నిందితు లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి బైకు 3 సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకోని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్, పోలీస్ సిబ్బంది సాదు నాయక్, సంతోష్‌లు ఉన్నారు.

● ఐదుగురు నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం మొగ్ధుంపూర్ వద్ద మంగళవారం కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్


ఎస్‌ఐ లక్ష్మారెడ్డి సిబ్బందితో వాహనాల

ఆధ్వర్యంలో ఎస్‌ఐ లక్ష్మారెడ్డి సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించగా ఐదుగురు నిందితుల వద్ద కిలో 98 గ్రాముల గంజాయి పట్టుబడింది.

కరీంనగర్ రూరల్ పోలీసుల వివరాల ప్రకారం మొగ్ధుంపూర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు బైక్‌లపై వస్తున్న ఐదుగురు వ్యక్తులు పోలీసులను చూసి బైక్‌లను అక్కడే వదిలిపెట్టి పారిపోయే ప్రయత్నం చేయగా వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకుని సోదా చేయగా నిషేధిత గంజాయి పట్టుబడింది. అనంతరం వారిని విచారించగా మహారాష్ట్రలోని బల్లార్షలో కొనుగోలు చేసి తీసుకువస్తున్నట్లు వెల్లడైంది. పట్టుబడిన నిందితులు కుందనపల్లికి చెందిన మేకల మహేందర్(22), తొర్రి శశికుమార్(24), ఫకీర్‌పేట్ గ్రామానికి చెందిన కడప వంశీ(19), ఎండీ సాధాకత్ అలీ(20), నగునూర్‌కు చెందిన గద్దల శ్రీరాం(19)లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జడ్జి ఆదేశాల మేరకు జైలులో రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

నిధులు మంజూరై రెండేళ్లు

● పనులు ప్రారంభానికి ఎన్నేళ్లో ● లోలెవల్ కల్వర్టుతో ప్రయాణికులకు ఇక్కట్లు


లో లెవల్ కల్వర్టు

పెగడపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా ఉంది పెగడపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని లోలెవల్ కల్వర్టు పరిస్థితి. నిధులు మంజూరై రెండేళ్లు కావస్తున్నా నిర్మాణ పనులు ప్రారంభానికి మాత్రం మోక్షం లభించడం లేదు. పెగడపల్లి మండల కేంద్రం నుంచి గోపాల్‌రావుపేట వెళ్లే రోడ్డులో సబ్‌స్టేషన్ సమీపంలో లో లెవల్ బ్రిడ్జితో వర్షాకాలంలో బ్రిడ్జిపై నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది దీంతో పాటు కల్వర్టు సైతం శిథిలా వస్థకు చేరుకోగా గత ప్రభుత్వం హయాంలోనే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి గాను రూ. రెండు న్నర కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు టెండర్ ప్రక్రియ సైతం పూర్తయింది. నిధులు మంజూరు, టెండరు పూర్తయినా నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ఆ రోడ్డు ద్వారా ప్రయాణించే ప్రయాణికులు కల్వర్టు దాటే వరకు భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. ఇప్పటికైనా స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జోక్యం చేసుకుని నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఆవుపై అడవి జంతువు దాడి

సైదాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు బాసవేని కుమార్‌కు చెందిన ఆవుపై సోమవారం రాత్రి గుర్తు తెలియని అడవి జంతువు దాడి చేసి గాయపరిచింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్ద ఆవును కట్టేసి ఇంటికి వచ్చాడు. ఉదయం వెళ్లి చూసేసరికి ఆవు మెడ కింది ముందు కాలు వద్ద పెద్ద గాయమయ్యి ఉందని తెలిపాడు. వెంటనే పశువైద్యులకు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి ట్రీట్‌మెంట్ చేశారన్నారు. ఆవుపై దాడి చేసింది హైనా అయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామ సమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేసినట్లు పేర్కొన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని ఇసుకను తరలిస్తున్న బద్దం రమేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అధ్వానంగా ఎస్సారెస్పీ కాలువలు

● పట్టించుకోని అధికారులు

● ఆందోళనలో రైతులు


షట్టర్లు లేకుండా మిగిలిపోయిన తూములు

పెగడపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ కాలువల మరమ్మతు లేక కాలువల ఆనవాళ్లు కోల్పోతున్నాయి. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలకు గాను నందగిరి, అయిత్‌పల్లి మినహా 21 గ్రామాలు శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోనే ఉండగా కాలువ నీరు వస్తేనే పంటలు పూర్తి స్థాయిలో పండేది. కాగా మండలంలోని పలు డిస్ట్రిబ్యూటరీ కాలు వలను ఎన్నో ఏండ్ల కింద సిమెంట్ లైనింగ్ చేయగా అప్పటి నుంచి వాటి మరమ్మతు, పూడిక తీత పనులపై పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

దీంతో దాదాపు అన్ని డిస్ట్రిబ్యూటరీ కాలువలు పిచ్చిమొక్కలతో నిండిపోవడమే కాకుండా సిమెంట్ లైనింగులు కూలిపోయి, తూముల షట్టర్లు ఊడిపోయి కాలువల ఆనవాళ్లు కనిపించకుండా పోయాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు ఉంది. రెండవ పంటకు మరి కొద్ది రోజుల్లో నీరు వదిలే పరిస్థితు


పెగడపల్లి శివారులో కాలువలో నిండిన మట్టి

లుండగా కాలువల మరమ్మతు పూడికతీత పిచ్చిమొక్కల తొలగింపునకు మాత్రం ఆ శాఖ అధికారులు దృష్టి సారించిన దాఖలాలు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. కాలు వలలో పిచ్చి మొక్కలు పెరిగి ప్రధాన కాలువ నుంచి ఎన్ని నీళ్లు వదిలినా ప్రధాన కాలువకు సమీప ప్రాంతాల రైతుల పంట పొలాలకు మాత్రమే నీరు అందుతోంది. చివరి ఆయకట్టు రైతులు ఎప్పుడూ పంటలు ఎండబెట్టుకునే పరిస్థితులే ఉన్నాయంటూ వాపోతున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలువల మరమ్మతులతో పాటు పిచ్చి మొక్కల తొలగింపునకు చర్యలు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

వర్గీకరణను మాలలంతా ఐక్యంగా తిప్పికొట్టాలి

- జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్
- సిరిసిల్లకు చేరుకున్న మాలల మహా పాద్రయాత్ర



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

సిరిసిల్ల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను మానుకోవాలని, వర్గీకరణను మాలలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. అక్టోబరు 25న భద్రాచలంలో ప్రారంభించిన మాలల మహా పాదయాత్ర మంగళవారం సిరిసిల్ల పట్టణానికి చేరకుంది. మాలమహానాడు జిల్లా, పట్టణ, మండలాల నాయకులు పాదయాత్ర చేస్తున్న పిల్లి సుధాకర్, నాయకులకు ఘన స్వాగతం పలికారు. స్థానిక రగుడు నుంచి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు పాదయాత్ర సాగింది. అంబేద్కర్ విగ్రహానికి సుధాకర్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి సుద్దాల దేవయ్య మాలల మహా పాదయాత్రకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడారు. మాదిగల కంచంలోని అన్నంను, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను గుంజుకుంటున్నామని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగంతో సంబంధం లేకుండా దొడ్డి దారిలో నరేంద్రమోదీ సుప్రీం కోర్టు ద్వారా రాష్ట్రాలకు వర్గీకరణ చేసుకునే విధంగా వెసులుబాటు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. మనువాదుల చెరలోకి మందకృష్ణ మాదిగ చేరాడని ఆరోపించారు. దళితులను మనువాదులు హింసలకు, మహిళలపై దాడులకు గురిచేస్తూంటే మనువాదుల మోచేతుల నీళ్లు తాగుతున్న మందకృష్ణమాదిగకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రావాలని మాలలు మొత్తం కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం తిరగారన్నారు. మాలలను మరిచిపోయి ఒక కులానికి కొమ్ము కాయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు తుంగ శివరాజు, జిల్లా నాయకులు రెంజర్ల రాజేష్, మేడి అంజయ్య, నాలుక సత్యం, జక్కుల యాదగిరి, రొడ్డ రాంచంద్రం, ఎడ్ల సందీప్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు



రోడ్డుమీదకు ఎక్కి నిరసన తెలుపుతున్న ప్రయాణికులు

వేములవాడ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆర్టీసీ బస్టాండులో బస్సులు లేక భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భక్తులు సోమవారం రాజన్నను దర్శించుకుని మంగళవారం బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు తీసి వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో మంగళవారం రాజన్న భక్తులతో పాటుగా, ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో బస్టాండులో బస్సులు లేకపోవడంతో గంటలపాటు నిరీక్షించిన భక్తులు సహనాన్ని కోల్పోయి రోడ్డుపైకి వెళ్లి వచ్చే బస్సులను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రయాణికులకు నచ్చజెప్పి ఒప్పించారు. దీంతో ప్రయాణికులు శాంతించారు.

చిన్నబోతున్న పర్యాటకం

- ప్రారంభోత్సవానికే పరిమితమైన మిడ్ మానేరు జల విహారం
- కార్మిక, ఆధ్యాత్మిక క్షేత్రానికి.. పర్యాటక సొబగులు దూరమేనా?
- జిల్లాలో మిడ్‌మానేరు, అనంతగిరి ప్రాజెక్టుల వద్ద ప్రతిపాదనలు
- అనంతగిరి ప్రాజెక్టులో 40 ఎకరాల్లో ఐలాండ్
- నేడు సిరిసిల్ల జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

కార్మిక, ఆధ్యాత్మిక జిల్లాగా రాజన్న సిరిసిల్ల నిలుస్తుంది. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నా నేతల హామీలు, పరిశీలనలకే పరిమితవుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కరకట్ట వద్ద అప్పటి మంత్రులు హడావుడిగా బోటు ప్రారంభించి జల విహారానికి నాంది పలికగా ప్రారంభోత్సవంతోనే నిలిచి పోయింది. దాదాపు మూడు సంవత్సరాలుగా సిరిసిల్ల ప్రజలు జలవిహారానికి ఎదురు చూసినా నిరాశే మిగిలింది. ప్రారంభించిన బోట్లు ఇప్పటికీ కరకట్ట వద్ద వెక్కిరిస్తూ కనిపిస్తున్నాయి. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు, అన్నపూర్ణ ప్రాజెక్ట్ వద్ద పర్యాటక రంగంవైపు చూస్తారని ఆశగా ప్రజలు ఎదురుచూస్తున్నారు.


పర్యాటకానికి రెండు ప్రాజెక్టులు కీలకం...

జిల్లాలోని మిడ్‌మానేరు, అన్నపూర్ణ రెండు ప్రాజెక్టులు పర్యాటకానికి కీలకంగా మారుతాయని భావించారు. వేములవాడల శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్యాత్మికతకు పర్యాటకం తోడవుతుందని అనుకున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాలకు సిరిసిల్ల మానేరు తీరంలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్టులు ప్రధానంగా నిలుస్తాయి. ఈ ప్రాజెక్టుల వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని 2021 జూలై 4న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనంతగిరి పోచమ్మను దర్శించుకుంటానని అన్నపూర్ణ అనంతగిరి, శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులను పర్యాటక అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. వేములవాడ ఆధ్యాత్మికతకు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు పర్యాటకం కూడా స్వాగతం పలుకుతుందని భావించినా ఆచరణలోకి మాత్రం రాలేదు. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు రెండు ప్రాజెక్టుల వద్ద పర్యాటక పరిశీలనలు జరిగాయి. మిడ్ మానేరు వద్ద కొడుముంజ గుట్టలకు కలుపుకొని రోప్‌వేలు కాటేజ్‌ల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. అదే క్రమంలో మిడ్ మానేరు బ్యాక్ వాటర్ సిరిసిల్ల కరకట్ట వద్ద బోటును కూడా సిద్ధం చేసినా కొవిడ్‌తో ప్రారంభానికి నోచుకోలేదు. శాసనసభ ఎన్నికల క్రమంలో గత సంవత్సరం ఆగస్టు 18న హడావుడిగా ప్రారంభోత్సవం చేసి వదిలేశారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మిడ్ మానేరులోని అందాలను చూసే విధంగా విహరించే అవకాశం అందుబాటులోకి వస్తుందని అనుకున్నా నిరాశే మిగిలింది.

ఐలాండ్ అభివృద్ధికి మోక్షం కలిగేనా...



ఇల్లంతకుంట మండలం అనంతగిరి వద్ద గుట్టలను అనుసంధానం చేస్తూ అన్నపూర్ణ, అనంతగిరి ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఇక్కడే ఆసియాలోనే అతి పెద్ద సర్జిపూల్ బావిని కూడా నిర్మించారు. ప్రాజెక్ట్‌లో మధ్యలో ఉన్న 40 ఎకరాలతో ఉన్న గుట్టను ఐలాండ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించినా ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు. ప్రాజెక్ట్ వద్ద పోచమ్మ తల్లి దేవాలయం కూడా ఉంది. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇక్కడికి వచ్చే పర్యాటకులు, యాత్రికులకు ప్రాజెక్ట్ ఎంతో ఆహ్లాదాన్ని పంచుతుందని భావిస్తున్నారు. జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి తెలంగాణలోని అన్ని జిల్లాలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు ప్రతీయేడు లక్షల సంఖ్యలో వచ్చి పోతుంటారు. మిడ్ మానేరు, అనంతగిరి ప్రాజెక్ట్‌లను పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని గత ప్రభుత్వం భావించింది. మిడ్ మానేరు ప్రాజెక్ట్ వద్ద బోటింగ్‌తో పాటు అడ్వెంచర్ పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక అభివృద్ధికి బాటలు వేయాలని ఈ ప్రాంతావాసులు కోరుకుంటున్నారు.



అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లో బోటు

బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రమేష్

భగత్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ బకాయిలు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు బంద్ చేస్తే విద్యార్థుల చదువులు ఎలా సాగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా పెండింగ్ ఫీజు బకాయిలు ఇవ్వకపోవడం సరి కాదన్నారు. రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులురవి, రమేష్, రాజు, క్రాంతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

24న ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖో-ఖో జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సీనియర్స్ పురుషులు, మహిళల ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 24న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9:30 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని జిల్లా ఖో- ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను వరంగల్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళలు, పురుషుల ఖో-ఖో పోటీలకు ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9:30 గంటలకు అంబేద్కర్ స్టేడియంలో ఒరిజినల్ ఆధార్ కార్డు, అలాగే ఒక జిరాక్స్, ఒక ఫొటోతో హాజరు కావాలని పేర్కొన్నారు.

నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- 21న లగచర్లకు వామపక్షనాయకులతో కలిసి వెళ్తాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సిరిసిల్ల నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నియంతృత్వ ధోరణి అవలంభిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మంగళవారం సీపీఐ జిల్లా మూడవ మహాసభల సందర్భంగా స్థానిక ఆర్డీవో కార్యాలయం నుంచి పట్టణంలోని బీవైనగర్ షాదీఖానా వరకు ఎర్రజెండాలు చేతబూని ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు.



సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

అనంతరం జరిగిన బహిరంగ సభలో తమ్మినేని మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టే పనులపై అఖిలపక్షం నాయకులతో చర్చలు జరపకుండా నియంతృత్వ ధోరణికి పాల్పడుతున్నారని అన్నారు. మూసీ నది ఒడ్డున ఉన్న ఇళ్లకు బదులుగా వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడంతోపాటు వారికి ప్రతీనెల 15 వేల రూపాయలను అందించి వారిని ఆదుకోవాలన్నారు.

గత ప్రభుత్వం ఫార్మాసిటీకి హైదరాబాద్ శివారులో 13వేల ఎకరాలను తీసుకున్నారని అక్కడ దానిని నిర్మించకుండా సీఎం నియోజకవర్గంలోని లగచర్లలో 10వేల ఎకరాల భూములను తీసుకోవడం సరైందికాద న్నారు. ఇటీవల అ గ్రామానికి వెళ్లిన జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులపై దాడులు చేసిన వారిలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారిని అరెస్ట్ చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులను వదిలివేయడం సరైంది కాదన్నారు. పోలీసులు లగచర్ల గ్రామానికి ఎవరి రానీయకుండా చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ నెల 21వ తేదీన వామపక్షాల పార్టీ నాయకులతో తాను లగచర్ల గ్రామానికి వెళ్లి అక్కడి రైతులు, ప్రజలతో మాట్లాతానని మమ్ములను ఎవరు అడ్డుకుంటురో చూ స్తామన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కమ్యూనిస్ట్ ఉద్యమం బలహీనంగా ఉన్నప్పటికీ బలమైన పోరాటం నిర్మించిందని అన్నారు.



సిరిసిల్లలో సీపీఎం ర్యాలీ

ముఖ్యమంత్రి బుధవారం జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి నేతన్నలకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వ అర్డర్లను ప్రకటించి తన చిత్తశుద్ధిని ప్రదర్శించాలనిన్నారు. కేంద్రంలోని బీజేపీ హిందుత్వ సిద్ధాంతం కేవలం అదానీ, అంబానీ వం టి అగ్రవర్ణాల ప్రయోజనాల కోసమని అసలైన హిందువులకు మేలు జరగదని వివరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, కూరపాటి రమేష్, జిల్లా కార్యదర్శి మూషం రమేష్, నాయకులు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, విమల, గన్నేరం నర్సయ్య, మల్లారపు అరుణ్‌కుమార్, ఎరవెల్లి నాగరాజుపాల్గొన్నారు.

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామిని సన్నిధానం మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో సందడిగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచే వందలాది వాహనాలు, కాలినడకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. మహిళ భక్తులు ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి కార్తీక పూజలు చేశారు. కరీంనగర్ జిల్లా జడ్జి ప్రతిమ అంజన్నను దర్శించుకున్నారు. కొండపైన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ తదితరులు భక్తుల రద్దీని పర్యవేక్షించారు.



కొండగట్టు ఆలయం వద్ద భక్తులు

● ధర్మపురిలో కార్తీక భక్తుల రద్దీ

- ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగించిన మహిళలు

ధర్మపురి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక భక్తుల రద్దీ మంగళవారం పెరిగింది. క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. స్థానిక శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. గోదావరి నదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించారు. నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టు ప్రదక్షిణాలు చేసి, లక్ష వత్తులు వెలిగించి, కార్తీక దామోదరుడిని పూజించారు. మహిళలు దీపాలు, వత్తులు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, అర్చకులు, నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.



గోదావరి నది వద్ద హారతి పూజలు

● 18 వ రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 18వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య అర్చకులు లోక క్షేమం కోసం, విశ్వశాంతి కోసం విశేష పూజలు జరిపారు. నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపండితులు పాలెపు ప్రవీణ్‌శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కార్తీక దీపోత్సవం

- కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు
- ఆకట్టుకున్న చిన్నారులు నృత్యాలు

వేములవాడ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. రాజన్న ఆలయంలోని కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవం కార్యక్రమానికి మంగళవారం భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం తీరొక్కపూలతో పలు ఆకృతుల్లో అందంగా దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా నిజామాబాద్‌కు చెందిన సిద్ధార్థ కళాక్షేత్రం ఆంధ్ర నాట్యము జయలక్ష్మి బృందం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ముఖ్య అర్చకులు దుమాల నాగరాజుశర్మ, వెంకటయ్య, కృపాల్ తదితరులు ఉన్నారు.



సామూహిక కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



కార్తీక సామూహిక దీపోత్సవంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

అర్హులు బీమా నమోదు చేయించుకోవాలి

జిల్లా లీడ్‌బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్

జగిత్యాలరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరు బీమా నమోదు చేసుకోవాలని లీడ్‌బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూధన్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని తక్కళ్లపల్లి గ్రామంలో ప్రధాన మంత్రి జీవనజ్యోతి, బీమాయోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల మధ్య కల్గిన ప్రతి ఒక్కరు బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పుష్ప, వీవోఏ లత, బీసీ పాయింట్ నిర్వాహకురాలు సిద్దు, సతీష్‌రెడ్డి, మ హిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

మల్లాపూర్, నవంబరు, 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాల్గొండ గ్రామంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామి వారి కల్యాణం, హోమం వంటి తదితర కార్యక్రమాలు వేదపండితుడు రాజశేఖర్‌చారి వేదమంత్రోత్సవాల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యంలో పాల్గొన్న భక్తులు స్వామి వారి కల్యాణం తిలకించినంతరం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.



వాల్గొండలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం జరుపుతున్న భక్తులు

పొంచి ఉన్న ప్రమాదం..



రహదారిపై ఏర్పాటు చేసిన కర్ర

మల్యాల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని కొండగట్టు స్టేజీ వద్ద రహదారి రెండు వైపులా తరచూ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. గతంలో పైప్‌లైన్ కోసం చేపట్టిన తవ్వకాలకు శాశ్వత పూడ్చివేత చర్యలు తీసుకోకపోగ తాత్కాలిక మరమ్మతులు చేయడంతో నెలకోసారి గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణీకులు, స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు

దరఖాస్తుల ఆహ్వానం

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులోని తెలంగాణ సాంఘీక గురుకుల పాఠశాలలోని సీటు కోసం ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవీలత ప్రకటన విడుదల చేశారు. పాఠశాలలో 5, 6, 8వ తరగతులలోని బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ కోసం తెలంగాణ గురుకుల సంస్థ కార్యదర్శి హైదరాబాద్ వారి ఆదేశాలకు మేరకు ఈనెల 22న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. టీజీ-సెట్ 2024కు 5వ తరగతి ప్రవేశ పరీక్షలో పాల్గొనే విద్యార్థులు ఈనెల 21 మధ్యాన్నం ఒంటి గంటలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

కోరుట్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వెంకటాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బాస భూమయ్య సహజ మరణం పొందగా మంగళవారం కాంగ్రెస్ నాయకులు సంతాపం ప్రకటించి ఆయన అతిమ యాత్రలో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు భూమయ్య మృతదేహంపై పుష్ప గుచ్చం ఉంచి నివాళ్లను అర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ బోయినిపల్లి సత్యం రావు కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుకలు



మేడిపల్లి, కోరుట్లలో ఇందిరాగాంధీకి నివాళులు అర్పిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మన్‌కుమార్, జువ్వాడి కృష్ణారావు

ధర్మపురి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దివంగత భారత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ధర్మపురి ఏ ఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ప్రసాద్ పాల్గొన్నారు.

కోరుట్ల : ఇందిరాగాంధీ దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరిచిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో ఇందిరా గాంధీ జయంతి పురస్కరించుకుని గాంధీ చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు కొంత రాజం, సత్యనారాయణ, వెంకటేష్ గౌడ్, పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని అంగడి బజారులో మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని ఇంది రాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్, పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలో మంగళవారం ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్యాల: యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మల్యాలలోని సోనియా ఆలయం వద్ద ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కేకు కట్ చేశారు. కాంగ్రెస్ నాయకులు వెల్మ లక్ష్మరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వినయ్, లక్ష్మణాచారి, ప్రకాష్‌రెడ్డి, లక్ష్మన్, తిరుపతి పాల్గొన్నారు.

మేడిపల్లి : ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందని ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మేడిపల్లిలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కార్యరక్తలతో కలిసి జరుపుకున్నరు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, ఏస్పురమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పెగడపల్లి : మండల కేంద్రంలో మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ కూడలిలో ఇందిర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

వెల్గటూర్: ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేం ధర్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోళ్ల తిరుపతి, మాజీ సర్పంచ్ మెరుగు మురళి, రామ్మోహన్‌రావు, గంధ్ర శ్రీకాంత్ రావు పాల్గొన్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు. నిశాంత్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు నేరెళ్ల మహేష్ పాల్గొన్నారు.

మల్లాపూర్ : ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పుండ్ర శ్రీనివాస్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎమ్‌సీ చైర్మన్ పుష్పలత, నాయకులు జీవన్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మల్లయ్య, జంగ్గారెడ్డి పాల్గొన్నారు.

బుగ్గారం : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఇందిరమ్మ జయంతి ఘనంగా నిర్వహించారు. చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మండల ఉపాధ్యాక్షులు నర్సగౌడ్,పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్ : పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణరావు పూలమాల వేసి వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, మండల అధ్యక్షులు అంజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రం ఇబ్రహీంపట్నంతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటాలకు, విగ్రహానికి పూలమాల వేసి వేడుకలను నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు దీపక్ రాజ్, నంద కిషోర్, శ్రీకాంత్, మోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమణను కలిసిన యువజన సంఘం సభ్యులు

జగిత్యాల అర్బన్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలోని 11వ వార్డుకు చెందిన మాదిగ యువజన సంఘం సభ్యులు మంగళవారం ఎమ్మెల్సీ ఎల్. రమణను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సంధర్భంగా మాదిగ యువజన సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా వినతి పత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ త్వరలో నిధులు మంజూరు చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సతీష్, రమణ, అయిల్నేని ఆనందరావు, వెంకటేశ్వర్ రావు పాలొన్నారు.

● జిల్లా కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో పని చేస్తున్న విద్యుత్ శాఖ ఏఈ సతీష్ ఆయన సిబ్బందితో కలిసి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రమణను మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఆయనకు పుష్పగుచ్చం అందజేశారు.

మహిళా సంఘాలకు ఊరట..

(5వ పేజీ తరువాయి)

మహిళా సంఘాలలో సభ్యులు తీసుకున్న రుణాలతో ఇతరులపై ఆధారపడకుండా తాము ఆర్థికంగా ఎదగడంతో పాటు మరికొంత మందికి ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లాలో చాలా చోట్ల వివిధ రకాల రుణాలు తీసుకొని క్యాంటిన్, పెరటి కోళ్ల పెంపకం, గేదెల షెడ్డు(పాల ఉత్పత్తి)తో పాటు వరి ధాన్యం కొనుగోళ్లు, స్కూల్ యూనిఫాం కుట్టుట, రైతు సేవా కేంద్రాల నిర్వహణ, ఎంటర్‌ప్రైజెస్‌లు తదతర వాటిని ఏర్పాటు చేసుకుంటున్నారు. సభ్యులకు రుణాలను అందించడమే కాకుండా వారు ఆదాయం వచ్చే యూనిట్లు ఏర్పాటు చేసేందుకు అవగాహన కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నారు.

● పాత బకాయిల మాటేమిటి...?

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళా సం ఘాలకు వడ్డీ లేని రుణ పథకాన్ని అమలు చేస్తామని ప్రకటించింది. అన్నట్లుగానే అధికారంలోకి రావడంతో గత యేడాది డిసెంబరు నుంచి బకాయిలను మహిళా సంఘాల సభ్యులకు చెల్లిస్తోంది. ఇలా ఇప్పటి వరకు నాలుగు నెలల బకాయిలను చెల్లించినప్పటికీ అంతకు ముందు బకాయిలపై ప్రకటన చేయకపోవడంతో మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. 2019-20 సంవత్సరం నుంచి వేలాది సంఘాలకు వడ్డీ బకాయిలు పేరుకుపోవడంతో వాటిని విడుదల చేస్తుందా... లేదా..అనే అయోమయం సంఘాల్లో నెలకొంది. అంతేకాక ఈ యేడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు బకాయిలు కూడా అందాల్సి ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి

రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



మహిళా సంఘాల సభ్యులు సంఘం ద్వారా తీసుకున్న రుణాలు ఆదాయం వచ్చే మార్గాన్ని ఎంచుకొని రుణాలను సద్విని యోగం చేసుకోవాలి. ప్రభుత్వం విడుదల చేసిన వడ్డీ నిధులు నేరుగా సభ్యుల ఖాతాల్లో జమ అవుతాయి. తీసుకున్న రుణాలను వాయిదాల ప్రకారం చెల్లించి, తిరిగి రుణం పొందవచ్చు. ఆసక్తి ఉన్న ప్రతీ ఒక్కరికీ అందించడం జరుగుతోంది.

ధర్మపురి బల్దియాలో 91.26 శాతం సర్వే పూర్తి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

ధర్మపురి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటా సమగ్ర కుటుంబ సర్వే ధర్మపురి పట్టణంలో 91.26 శాతం పూర్తి అయ్యిందని మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో 15 వార్డులు ఉండగా 38 ఎన్యుమరేటర్ల బ్లాక్‌లుగా గుర్తించామన్నారు. ఈ నెల 18 వరకు 4910 కుటుంబాలకు గాను 4481 కుటుంబాల సర్వే పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. మొత్తం 91.26 శాతం సర్వే పూర్తి చేశామన్నారు. సర్వే ఈ నెల 20 నాటికి త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఈ నెల 21 నుంచి సర్వే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టిన సర్వేలో ధర్మపురి రెండవ స్థానంలో ఉందన్నారు. పట్టణంలో షాపుల యజమానులు ముందుకు వచ్చి వ్యాపారం చేస్తే నోటీసులు జారీ చేస్తామని ఆయన తెలిపారు.

అలాగే పశువులు, పందులు సంచరిస్తే అందుకు సంబంధించిన యజమానులకు అపరాధ రుసుము వేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ధర్మపురి మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ చిట్యాల గంగాధర్, టీఎంసీ జలంధర్ పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించండి

ఆర్డీవో మధుసూదన్

రాయికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ అన్నారు. రాయికల్ పట్టణంలో సమగ్ర కుటుంబ సర్వేను ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది సర్వే చేస్తున్న తీరును తెలుసుకున్నారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. అనంతరం మండలంలోని అల్లీపూర్, అయోధ్య గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ ఎండీ ఖయ్యూం, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్, సింగిల్ విండో చైర్మన్‌లు రాజలింగం, దీటి రాజరెడ్డి, సీఈవోలు ఉపేందర్, తిరుపతి తదితరులు ఉన్నారు.



సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో

మాలల సింహ గర్జనను విజయవంతం చేయాలి

ధర్మపురి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబరు 1 న జరిగే మాలల సింహ గర్జన విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో-కన్వీనర్ నల్లాల కనకరాజు కోరారు. ధర్మపురి పట్టణంలోని కమలాపూర్ చౌరస్తా వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట మాలల సింహ గర్జన కరపత్రాలను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వర్గాల మధ్య పోరాటం జయాపజయాలకు దారి తీస్తుందని తెలిపారు. ఒకే వర్గం మధ్య పోరాటం ఆ వర్గ నాశనానికి దారి తీస్తుందని ఆయన అన్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, కర్షకులు, కార్మికులు, మహిళలు, మేధావులు, న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజనీర్లు, జర్నలిస్టులు అందరు సింహ గర్జనకు తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయ కులు అనంతుల లక్ష్మణ్, మొలుగూరి రమేష్, కాళ్ల లచ్చయ్య, తరాల్ల కార్తీక్, మొలుగూరి రాజన్న తదితరులు పాల్గొన్నారు.



మాలల సింహ గర్జన కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

సంపూర్ణ స్వచ్ఛతకు ప్రతీ పౌరుడు కృషి చేయాలి

పెగడపల్లి మండల ప్రత్యేకాధికారి మనోహర్

పెగడపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మరుగు దొడ్లను పరిశుభ్రంగా ఉంచుకుంటూ సుస్థిరంగా వినియోగిస్తూ సంపూర్ణ స్వచ్ఛతకు ప్రతి పౌరుడు కృషి చేయాలని పెగడపల్లి మండల ప్రత్యేకాధికారి మనోహర్ పేర్కొన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పెగడపల్లి మండల కేంద్రంలో మండల అధికారులు, గ్రామపంచాయతీ ఉద్యోగులతో కలసి ఇల్లిల్లూ తిరిగి మరుగుదొడ్ల వాడకం, పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామాన్ని రేయింబవళ్లు కష్టపడుతూ పరిశుభ్రంగా ఉండేందుకు పని చేస్తున్న గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బందిని అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కారోబార్ స్వామి పాల్గొన్నారు.

కోరుట్ల : ప్రపంచ టాయిలెట్ల దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య పనులను చెపట్టి ప్రపంచ టాయిలెట్ల దినోత్సవం నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాలలో ఉన్న పబ్లిక్ టాయిలెట్లను శుభ్రం చేసి పారిశుధ్య పనులను నిర్వహించారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలోని ఆటో డ్రైవర్లతో పారిశుధ్యంపై పట్టణ ప్రజలు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి సానీటరీ ఇన్స్పెక్టర్ ఆశోక్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మహేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : ఇండ్లల్లోని మరుగుదొడ్ల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరికి చేరవని పంచాయతీ కార్యదర్శి నిజామొద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా ఆత్మనగర్ గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బందిని శాలువలతో సన్మానించారు. అనంతరం గ్రామంలో మరుగుదొడ్ల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఎన్ఎమ్, విద్యార్థులు, పాల్గొన్నారు.

సిరికొండ మీసేవా కేంద్రంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కథలాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరికొండ శాశ్వత మీసేవా కేంద్రం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని మాజీ ఎంపీపీ నాంపల్లి లింబాద్రి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వాస్తవానికి గ్రామపంచాయతీలో మీసేవ కొనసాగించాల్సి ఉండగా తన సొంత ఇంట్లో నడుపుతూ నిబంధనలను తుంగలో తొక్కారని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ లొకేషన్ పేరిట మంజూరు చేంయించుకుని ఇంట్లో నడపడం పట్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరక మంగళవారం ఆర్ఐ నగేశ్ స్థానికంగా విచారణ జరిపారు. నివేదికను కలెక్టర్‌కు నివేదించామని ఆర్ఐ తెలిపారు.

సందేహాలను నివృత్తి చేసుకున్న రైతులు

కొడిమ్యాల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పూడూర్ రైతు వేదిక భవనంలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పలువురు రైతులకు వరికొయ్యలు కాల్చడం ద్వారా కలుగిన సందేహాలను శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ నివృత్తి చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సీసీఐ ఆధ్వర్యంలో జిన్నింగ్ మిల్లులో పత్తి అమ్మకానికి వచ్చిన రైతులతో మాట్లాడారు. అంతే కాకుండ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పూడూర్ గ్రామ మాజీ సర్పంచ వెల్ముల రాంరెడ్డి, ఏఈవోలు గ్రీష్మ, రాజేష్, శ్రీలత, ప్రశాంత్, పలువురు రైతులు పాల్గొన్నారు.

సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన

జగిత్యాలరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతాంగానికి నాణ్యమైన విత్తనాలు అందించేదిశగా రాష్ట్ర విత్తనాభివృద్ది సంస్థ కృషిచేస్తుందని రాష్ట్ర విత్తనాభివృద్దిసంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో నిర్మిస్తున్న సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యకలాపాలను ముమ్మరం చేస్తామని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు అందించే తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థను సహకార సంఘాలు ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మల్లాపూర్, నవంబరు, 19 (ఆంధ్రజ్యోతి) : మోడల్ స్కూల్‌ల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం పెట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రిన్సిపాల్‌కు సూచించారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఎమ్మెల్యేకు మోడల్ స్కూల్‌ల్లోని సమస్యలను పలువురు నాయకులు తెలుపగా సందర్శించారు. పాఠశాలలోని పరిసరాలు, తరగతి గదులు, వంటగది పరిశీలించి, విద్యార్థులతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మోడల్ స్కూల్‌ల్లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని సంబంధింత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కోరారు. విద్యార్థి దశ చాలా గొప్పది, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించుకోవాలన్నారు. పాఠశాలలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఈయన వెంటా ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందించడానికి కృషి

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించడానికి నిరంతరం కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 76 మందికి కల్యాణ లక్ష్మి, షాదిముబారాక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా తులం బంగారం లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని సమస్యలు దృష్టికి తీసుకోస్తే సంబంధిత శాఖతో పరిష్కరించే దిశగా కృషి చేస్తాన్నారు. గ్రామంలోని పెద్దమ్మ కాలనీలో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు తెలపగా స్పందించిన ఎమ్మెల్యే ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏఎమ్‌సీ చైర్మన్‌ను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీర్‌సింగ్, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

ఘాట్‌రోడ్డుపై నియంత్రనేదీ..

మల్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై వాహనాల రాక పోకలపై నియంత్రణ కరువైంది. కొన్నేళ్ల క్రితం బస్సు ప్రమాదం జరిగిన తరువాత వాహనాలకు అనుమతి లేకపోగ షరతులతో రాకపోకలకు అనుమతి ఇచ్చారు. అయితే వాహనాలు పరిమితికి మించి ప్రమాదకరంగా ఘాట్‌రోడ్డుపై పయనిస్తున్నాయి. మళ్లీ ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు అంటూ భక్తులు చర్చించుకుంటున్నారు.



ఘాట్‌రోడ్డుపై ఓవర్‌లోడ్‌తో వెలుతున్న వాహనం

బస్ డిపో ఎదుట సీఐటీయూ ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

జగిత్యాల అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల నుంచి ఆర్టీసీ కార్మిక సంఘాలపై విధిస్తున్న ఆంక్షలు ఎత్తివేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్సు డిపో ఎదుట సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. ప్రభుత్వం తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఆర్టీసీ నిర్వహణలో కార్మిక సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలని, సామాజిక భద్రత పథకాలైన పీఎఫ్, ఎస్ఆర్‌బీఎస్ బీటీ ట్రస్టులకు కార్మిక సంఘాల ప్రతినిధుల భాగస్వామ్యంతో బోర్డు ఆఫ్ ట్రస్టీలను నియమించాలని, ప్రజాతంత్ర హక్కులు పునరుద్ధరించాలని డిమాండ్‌తో చేపట్టిన ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొమ్మెన సురేష్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మిక ఉద్యమంపై ఆంక్షలు విధించిందన్నారు.

తమ హక్కుల కోసం ప్రశ్నిస్తున్న ఆర్టీసీ కార్మికుల గొంతులో కలం అత్యంత దుర్మార్గమైందని, ఈ వైఖరితో ఉన్న పాలకులు రాష్ట్ర ప్రజల ప్రజాతంత్ర హక్కులను హరించే ప్రమాదం ఉందని, అందుకనే ఆర్టీసీ కార్మికులకు రాష్ట్ర కార్మికవర్గం ప్రజానీకం అండగా ఉంటుందన్నారు.

ఉచిత విద్య, వైద్యం అందించాలి

మల్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీలార్‌కు వినతిపత్రం అందజేశారు. అర్హతలను బట్టి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఇళ్లు లేని వారికి భూమి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గసిగంటి ఉపేంద్ర, మండల కన్వీనర్ ప్రణీత్‌తో పాటు నరేశ్, తరుణ్, విఘ్నేష్, పవన్, అశోక్ పాల్గొన్నారు

పోస్టర్ ఆవిష్కరణ

మల్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మోసాల పుట్ట ధరణి-దొల్లతనపు భూమాత అనే అంశంపై డిసెంబరు 9న తెలంగాణ రైతు కూలీ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను మంగళవారం మండలంలోని లంబాడిపల్లిలో ఆవిష్కరించారు. సదస్సు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మక్క, కరుణాకర్, రాయమల్లు, రాజయ్య, సాయి, మల్లయ్య, మల్లేశం పాల్గొన్నారు

ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏ లో చేర్చాలి

మెట్‌పల్లిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏలో చేర్చి రిజర్వేషన్‌లు అమలు చేయాలని ముదిరాజ్ రాష్ట్ర కార్యదర్శి తోకల రాజేశ్వర్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌బి సమావేశం మందిరంలో కోరుట్ల నియోజకవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 21న తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఉత్సవాల సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సలహాదారు డాక్టర్ ఆనంద్ బాబు, నాయకులు రాజయ్య, సత్యనారయణ, రాం బాబు, లక్ష్మణ్, శ్రీనివాస్, సత్యనారయణ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

భీమారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని మన్నెగూడెం 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఆవరణలో మంగళవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజలు, రైతులకు విద్యుత్ అధికారులు విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన మెళకువలు, జాగ్రత్తలు, సంరక్షణ చర్యలను వివరించారు. సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్ ఎరుకల నారాయణ, మెంబర్ టెక్నికల్ సలంద్ర రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ లకావత్ కిషన్ పాల్గొన్నారు.